సమస్యలు తెలిపేందుకు టోల్‌ఫ్రీ నెంబర్

నిర్మల్‌కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ పురపాలక సంఘం పరిధిలో రంజాన్, ఉగాది పండుగలతో పాటు పలు సందర్భాల్లో ప్రజల అత్యవసర సమస్యలు తెలిపేందుకు టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఖమర్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర పారిశుధ్యం, నీటి వసతి, ఇతర సేవలకు టోల్‌ఫ్రీ నెంబర్ 7036661070కు కాల్‌చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకం





అంగట్లో.. ఔట్ సోర్సింగ్ పోస్టులు!





బాధితునికి శ్రీదేవి ఏజెన్సీ పేరిట నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను జారీ చేసిన పత్రం ఇదే..

- బోగస్ ఏజెన్సీల పేరిట అమాయకులకు వల
- నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లతో బురిడీ
- బాధితుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు
- వలలో చిక్కుకుంటున్న జిల్లాలోని నిరుద్యోగులు
- అక్రమాలపై దృష్టి సారించిన జిల్లా ఎస్పీ

నిర్మల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొద్ది రోజుల నుంచి ఔట్ సోర్సింగ్ పోస్టులు అంగడి సరుకుగా మారాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న కొంతమంది దళారులు ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట పెద్ద ఎత్తున అక్రమాలకు తెర తీస్తున్నారు. జిల్లాలో గతంలో కూడా ఇలా కొన్ని బోగస్ ఔట్ సోర్సింగ్ సంస్థలు ఉద్యోగాల పేరిట అమాయకులకు కుచ్చు టోపీ పెట్టిన సంగతి తెలిసిందే. అయితే ఇటీవలే జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పలు ఔట్ సోర్సింగ్ పోస్టుల కోసం సంబంధిత అధికారులు నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ ఆధారంగా వందలాది మంది నిరుద్యోగులు ఔట్ సోర్సింగ్ పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే ఈ పోస్టులను ఔట్ సోర్సింగ్ సంస్థలకు కేటాయించడంతో ఆ సంస్థలు దరఖాస్తులను స్వీకరించి సంబంధిత ఉన్నతాధికారులకు అందజేసింది. కాగా, మరో సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు తమకే కేటాయించబడ్డాయంటూ కొంతమంది దళారులను రంగంలోకి దింపింది. ఈ సదరు దళారులు అమాయకులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ భరోసా కల్పించి వారి నుంచి లక్షల రూపాయలు వసూలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ పోస్టులకు దరఖాస్తులు చేసే సమయంలోనే కొంతమంది దళారులు రంగంలోకి దిగి తామే కొలువులు ఇప్పిస్తామంటూ అమాయకులకు వల విసిరారు. అప్పట్లోనే కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు ఎస్పీ జానకీ షర్మిల దళారుల మాటలు నమ్మవద్దని మెరిట్ ప్రకారమే ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు లభిస్తాయంటూ ప్రత్యేకంగా ప్రకటనలు సైతం జారీ చేశారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల స్తబ్దంగా ఉన్న ఈ నియామక వ్యవహారం దళారులు మళ్లీ తెరపైకి తెచ్చారు. అప్పటికే ఉద్యోగాలు లభించక నిరాశతో ఉన్న కొంతమంది నిరుద్యోగులు ఈ దళారుల మాటలను నమ్మి లక్షల రూపాయలు చెల్లించుకున్నారు. ఒక్కో పోస్టుకు రూ.2 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. కాగా, మొదటి నుంచి ఈ అక్రమ దందాపై నిఘా పెట్టిన ఎస్పీ జానకీ షర్మిల మొత్తం బోగస్ సంస్థ, దళారులపై దృష్టి సారించింది. అప్పటికే తమకు నకిలీ నియామక పత్రాలు ఇచ్చి మోసం చేశారంటూ పలువురు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు గుట్టురట్టయ్యింది.

బాధితుడి ఫిర్యాదుతో గుట్టురట్టు..

ఇదిలా ఉండగా షేక్ ఇస్లాంతో పాటు మరో ముగ్గురికి శ్రీదేవి ఏజెన్సీ పేరిట ఓ మహిళ ఏకంగా మెడికల్ కాలేజీ ఏబ్లంతో ఉన్న అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను జారీ చేసింది. అయితే ఈ అపాయింట్‌మెంట్ ఆర్డర్ పట్టుకొని మెడికల్ కాలేజీకి వెళ్లిన బాధితులకు అక్కడ అసలు వాస్తవం తెలిసింది. ఇంతలో వారు షాక్‌కు గురై సదరు ఏజెన్సీ నిర్వాహకురాలిని కలిసేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో వారు నేరుగా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. షేక్ ఇస్లాంతో పాటు మరో నలుగురు మోసపోయామని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటికే ఈ వ్యవహారంపై నిఘా పెట్టిన ఎస్పీ జానకీ షర్మిల ఫిర్యాదుపై స్పందించి చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. దీంతో పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ శ్రీదేవి ఏజెన్సీ నిర్వాహకురాలు శ్రీజపై కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు.

అమాయకులే లక్ష్యంగా..

జిల్లాలో కొద్ది రోజుల నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట కొంతమంది దళారులు అమాయకులను లక్ష్యంగా చేసుకొని వల విసురుతున్నారు. ఇప్పటి వరకు బాధితులు పోలీసులకు నేరుగా ఫిర్యాదు చేయకపోవడంతో ఎలాంటి కేసులు నమోదు కాలేదు. బోగస్ ఏజెన్సీలు, డబ్బుల వసూళ్ల లాంటి వ్యవహారాలు బహిరంగంగానే సాగుతున్నప్పటికీ బాధితులు ఎవరు ముందుకు రాకపోతుండడంతో ఈ వ్యవహారం రివాజుగా సాగుతోంది. అయితే ఇటీవల నిర్మల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో పలు విభాగాలకు చెందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఈ నోటిఫికేషన్‌ను ఆసరాగా చేసుకున్న పలువురు అక్రమార్కులు అమాకులకు వల విసిరి తాము ఉద్యోగాలు కల్పిస్తామంటూ లక్షల రూపాయల్లో వసూలు చేశారు. అయితే అటు కలెక్టర్ ఇటు ఎస్పీలు హెచ్చరించినప్పటికీ అమాయక నిరుద్యోగులు మాత్రం కొలువులకు ఆశపడి దళారులను నమ్మి మోసపోయారు. జిల్లాలో దాదాపు ఔట్ సోర్సింగ్ పోస్టుల పేరిట అమాయకుల నుంచి కోటి రూపాయల వరకు వసూలు చేశారన్న ఆరోపణలున్నాయి.

కొరడా ఝుళిపించిన ఎస్పీ జానకీ షర్మిల..

మొదటి నుంచి సైబర్ క్రైంతో పాటు ఆర్థిక మోసాలు, ఇతర నేరాలపై కొరడా ఝుళిపిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల అక్రమాలపై సైతం దృష్టి కేంద్రీకరించారు. ఇందులో భాగంగానే మొదట బోగస్ సంస్థలను అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ప్రచారం చేసే వారిని నమ్మవద్దంటూ ఎస్పీ నిరుద్యోగులను హెచ్చరించారు. అయినప్పటికీ కొంతమంది నిరుద్యోగులు బోగస్ సంస్థల నిర్వహకుల వలలో చిక్కుకున్నట్లు గుర్తిస్తూ ఆ దిశగా నిఘా సారించారు. ఇంటెలిజెన్స్ వర్గాల ద్వారా నివేదిక తెప్పించుకున్న ఎస్పీ అసలు బాధితుల ద్వారా నకిలీ గుట్టును తేల్చారు. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్‌లో నేరుగా ఫిర్యాదు చేయగలిగారు. ఈ సందర్భంగా నకిలీ నియామకపు ఉత్తర్వులు జారీ చేసే వారిపైనా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట అమాయకులను మోసం చేసే వారిపైనా ఇక నుంచి కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఎస్పీ హెచ్చరించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

ప్రత్యేక వైకల్య గుర్తింపుకార్డుకు

పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

నిర్మల్ కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక వైకల్య గుర్తింపుకార్డులు (సదరం) పొందేందుకు యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ స్పష్టం చేశారు. శనివారం కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేకగుర్తింపుకార్డులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో యూఐడీఐ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే విధానంపై వికలాంగులకు అవగాహన కల్పించాలన్నారు. గతంలో ధ్రువీకరణ పత్రం కోసం మీసేవా, వీఎల్‌ఈ కేంద్రాల్లో నమోదు చేసుకునేవారని, ప్రస్తుతం యూడీఐడీ పోర్టల్, సొంత మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్లు, స్లాట్స్ బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. క్యాంపుల వివరాలు మెసేజ్ చేస్తారన్నారు. 21 రకాల వైకల్యం గల వారు యూడీఐడీ కార్డు పొందవచ్చునని వివరించారు. గతంలో సదరం ధ్రువీకరణ పత్రం ఉన్నవారు రిజిస్టర్ చేసుకోవలసిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. సదరం క్యాంపులు నిర్వహించేందుకు 38 సంస్థలను గుర్తించామని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల్లో 8 మంది డిబార్

భైంసా, మార్చ్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ గోపాల్‌రావు పటేల్ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రారంభమైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డిగ్రీ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల్లో కాపీ కొడుతూ ఎనిమిది మంది పట్టుబడ్డారు. ఐదోసెమిస్టర్ పరీక్షల్లో భాగంగా కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఎనిమిది మంది విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య పట్టుకున్నారు. కాపీయింగ్‌కు పాల్పడితే సహించబోనని ప్రిన్సిపాల్ కర్రోల్ల బుచ్చయ్య తెలిపారు. కో-ఆర్డినేటర్ రఘునాథ్, పరిశీలకులు అజయ్ పర్యవేక్షించారు.

పన్నులు చెల్లించని దుకాణాల సీజ్



పన్నులు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

భైంసా, మార్చ్ 1 (ఆంధ్రజ్యోతి): వార్షిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న నేపథ్యంలో మున్సిపల్ అధికార యంత్రాంగం పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించింది. బకాయిదారుల నుంచి పన్నులను వసూళ్లు చేసేందుకు గాను పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా శనివారం మున్సిపల్ ప్రత్యేకాధికారి ఫైజాన్‌అహ్మద్, కమిషనర్ రాజేష్‌కుమార్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికార బృందం పన్నుల వసూళ్ల కోసం గాను క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టింది. మున్సిపల్ మేనేజర్ గౌరీష్‌కుమార్, రెవెన్యూ అధికారి రమేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికార బృందం బకాయిదారుల దుకాణాల వద్దకు వెళ్లి పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. భైంసా మున్సిపల్ పరిధిలో 2024-25 వార్షిక సంవత్సరానికి సంబంధించి పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.5.67కోట్లుగా ఉంది. శనివారం వరకు మున్సిపల్ పరిధిలో 32.14 శాతంతో రూ.1.82 కోట్ల పన్నులను వసూలు చేశారు. ఇంకా రూ.3.85 కోట్ల వరకు పన్నులు వసూలు చేయాల్సి ఉంది. వందశాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా మున్సిపల్ అధికార యంత్రాంగం చర్యలను ముమ్మరం చేసింది. శనివారం మున్సిపల్ అధికార బృందం లక్షకు పైగా ఆస్తిపన్ను బకాయి ఉండి చెల్లింపులు చేపట్టని పలు దుకాణాలకు తాళం వేశారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పన్నులు చెల్లించని దుకాణాలను సీజ్ చేయనున్నట్లుగా మున్సిపల్ అధికార యంత్రాంగం వెల్లడించింది. మున్సిపల్ ఉన్నతాధికార యంత్రాంగం పన్నుల వసూళ్ల కోసం గాను పట్టణపరిధిలో స్పెషల్‌డ్రైవ్ నిర్వహణకు ఆదేశించింది. పన్నులవసూళ్ల కోసం గాను 9 బృందాలను ఏర్పాటు చేశారు. రోజు వారీగా రూ.12.56లక్షల టార్గెట్‌ను విధించడంతో వసూళ్ల కోసం పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు.

బాలుర వసతి గృహం తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వసతి గృహాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

నర్సాపూర్ (జీ), మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : బాలురవసతి గృహాన్ని శనివారం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ జాదవ్ అంబాజీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. 'విజృంభిస్తున్న చికెన్ పాక్స్' అనే కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రతిహాస్టల్ పాఠశాలలో విద్యార్థులకు వైరల్ జ్వరాలు, అంటు వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. శుక్రవారం చికెన్ పాక్స్ 25 మంది విద్యార్థులకు సోకిందని, శనివారం మరో ఐదుగురికి సోకిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ సూచనల మేరకు ప్రత్యేక గదులలో ప్రతి విద్యార్థికి గది ఉష్ణోగ్రతకు తగ్గట్టుగా విద్యార్థులను పరిశుభ్ర గదులలో ఉంచామని తెలిపారు. వైద్యుల సూచన మేరకు విద్యార్థుల తల్లి దండ్రులు చికెన్ పాక్స్ లక్షణాలు కలిగిన విద్యార్థులను ఇంటికి తీసుకువెళ్లారని తెలిపారు. వసతి గృహంలో మూడోతరగతి నుంచి ఏడోతరగతి వరకు 175 మంది విద్యార్థులకు గాను శనివారం 98 మంది వసతి గృహంలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రామారావు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి రాథోడ్ శివాజీ, డీఎంవో నైనారెడ్డి, వైద్యులు ప్రమోద్ చంద్రారెడ్డి, ప్రియాంక, రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది హేమ, దుర్గాభవాని, వార్డెన్ ముత్యం, తదితరులు పాల్గొన్నారు.

కదిలి, కాల్వ దేవస్థానాల హుండీ లెక్కింపు



కదిలి దేవాలయంలో హుండీ లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

దిలావర్‌పూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీ కదిలి పాపహరేశ్వర స్వామి, శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానాల హుండీలను శనివారం లెక్కించారు. మహాశివరాత్రి సందర్భాన్ని పురస్కరించుకొని కదిలి దేవస్థానం హుండీ ద్వారా రూ.4,52,189 నగదు, టికెట్ల ద్వారా రూ. 1,87,427లు రాగా మొత్తం రూ. 6,39,616 ఆదాయం లభించింది.

కాల్వ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో...

శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం హుండీని శనివారం లెక్కించారు. హుండీ ద్వారా రూ. 5,47,021లు, టికెట్ల ద్వారా రూ.75,257లు మొత్తం రూ.6,22,278ల ఆదాయం వచ్చినట్లు ఆయా దేవస్థానాల ఈవో భూమయ్య తెలిపారు. కదిలి దేవస్థానం చైర్మన్ వెంకట్ రావు పటేల్, డైరెక్టర్లు దత్తు పటేల్, రమేష్, భూమేష్, కాల్వలో మహేష్, నర్సయ్య, ఆయా దేవాలయాల జూనియర్ అసిస్టెంట్‌లు మాధవరావు, మనోహర్, భక్తులు పాల్గొన్నారు.

అధిక ధరలకు యూరియా అమ్మితే చర్యలు

- ఎంఏవో రాజశేఖర్ రెడ్డి

దిలావర్‌పూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైన యూరియాను, రసాయన పురుగు మందులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలుంటాయని మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం గుండంపల్లి రైతువేదికలో మండలంలోని ఇన్‌పుట్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏవో మాట్లాడుతూ... యూరియాతో పాటు రసాయనిక ఎరువులు, ఇతర క్రిమిసంహారక మందులను కొందరు డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇకపై తీరు మార్చుకోవాలన్నారు. యూరియా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో అధిక ధరలకు విక్రయించవద్దని చెప్పారు. రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, యూరియా లేదంటూ కొంతమంది ఎక్కువ ధర అడుగుతున్నారని ఫిర్యాదులున్నాయన్నారు. సమావేశంలో మండలంలోని ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు

భైంసా, మార్చి, 1 : (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి విద్యార్థులు పరీక్షల కోసం ప్రణాళిక బద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మోహన్‌రావు పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావు పటేల్ పేర్కొన్నారు. శనివారం భైంసా పట్టణంలోని కస్తుర్భాగాంధీ బాలికల విద్యాలయం, ఆశ్రమ పాఠశాల, మైనార్టీ గురుకులంతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో ట్రస్ట్ ఆధ్వ ర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లా డారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆత్మస్థైర్యంతో పరీక్షల కోసం సిద్ధమవ్వాలన్నారు. చదువుతోనే ప్రగతి సాధ్యమవుతుందన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తుపెట్టుకోవాలన్నారు. పరీక్షలపై భయాందోళనలు విడనాడి మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని సూచించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ముథోల్ మాజీ ఎంపీపీ జాదవ్ సుభాష్ పాటిల్, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్

నిర్మల్ అర్బన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పదోతరగతి బోర్డుపరీక్షల నిర్వహణలో పాల్గొనబోయే అధికారులందరికీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... పదోతరగతి పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆయా అధికారులంతా తమ తమ విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో మొత్తం 47 పరీక్షా కేంద్రాల్లో 9,129 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పదోతరగతి పరీక్షలు మార్చి 21వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. అన్ని పరీక్షలను ఉదయం 9:30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12:30 నిమిషాల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాకు చేరుకున్న పరీక్షల సామగ్రికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి పరీక్షల నిర్వహణ కోసం నియమించిన చీఫ్ సూపరిండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇతర అధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష, జవాబు పత్రాల తరలింపు సమయంలో తగిన భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు జిల్లాకు చేరుకున్న పరీక్షల సామగ్రిని నిర్దేశిత ప్రదేశాలను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను నిర్వహించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో తాగునీరు, వైద్యసిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాల దగ్గర పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష జరుగుతున్నంతసేపు పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా పరీక్షల సమయానికి తగ్గట్టుగా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో భాగస్వామ్యం అయ్యే అధికారులందరికీ శిక్షణను ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో డీఈవో పి. రామారావు, విద్యాశాఖ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ మందిరం ఆవరణలో యజ్ఞం చేస్తున్న గ్రామస్థులు

కులమతాలకు అతీతంగా పూజలు

ఉట్నూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్యాంపూర్‌లో కుల మతాలకు అతీతంగా గ్రామస్థులంతా కలిసి హనుమాన్ మందిరంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన షేక్ సలీం బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ ఉద్యోగం చేస్తూనే గ్రామాని వచ్చి అందరితో కలిసిమెలసి ఉండేవాడు. పలు సేవా కార్యక్రమాలు చేస్తూ.. అందరికీ చేదోడువాదోడుగా ఉండేవాడు. అయితే, ఇటీవల సలీం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామస్థులు స్థానిక హనుమాన్ మందిరం ఆవరణలో సలీం ఆరోగ్యం మెరుగుపడాలంటూ ప్రత్యేక పూజలు, యజ్ఞం చేశారు. ఇందులో మాజీ వైస్ ఎంపీపీ దావులే బాలాజి, దావులే ఓంప్రకాష్, మాజీ సర్పంచ్ జగదీశ్‌జాదవ్, మాజీ ఎంపీటీసీ రాజేశ్వర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల సందర్భంగా 163 యాక్టు

ఉట్నూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తారీఖు నుంచి 25 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల సందర్భంగా 163 యాక్టు అమలులో ఉంటుందని ఉట్నూర్ మండల తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రాల సమయంలోగాని, పట్టణంలో గాని ఎవరు గుంపులుగా ఉండరాదని, ఎలాంటి మారుణాయుధాలు కలిగి ఉండి తిరగరాదన్నారు. అలాంటి వారి పై 163 యాక్టివ్ ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.

వర్గీకరణ పోరులో అమరులకు నివాళి

ఇచ్చోడ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. శవారం మండల కేంద్రంలో నిర్వహించిన అమరవీరుల సంస్మరణ దినోత్సవ సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. అమరుల ఆశయ సాధన కోసం మందకృష్ణ మాదిగ సారథ్యంలో జరిగే ప్రతిపోరుకు మాదిగలు సంసిద్ధమై ఉండాలని, లక్ష డప్పుల వేల గొంతుల మాదిగల మహా ప్రదర్శనకు సిద్ధమై ఉండాలన్నారు. ఇందులో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెపు గణేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, మండల అధ్యక్షుడు చిట్టి రవి, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు మరువలేమని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అమరులైన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు.

ఆదిలాబాద్ రూరల్: ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అమరుల త్యాగాలు మరవలేనివని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ పేర్కొన్నారు. కాగా, శనివారం ఆదిలాబాద్ అంబేద్కర్ భవనంలో వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. అమలు వీరుల స్ఫూర్తితో మందకృష్ణ మాదిగ నేతృత్వంలో వ్యక్తి వర్గీకరణ సాధించడం జరిగిందని అన్నారు.

'మాల మహార్ సంఘానికి న్యాయం చేయాలి'

తాంసి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాల మహార్ సంఘానికి అన్ని విధాలుగా సహకారాలు అందించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మొట్ట ప్రదీప్ కోరారు. శనివారం అంబేద్కర్ అనుచరుడైన దీనాబానా చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కులస్థుల్లో చాలా మంది నిరుపేదలేనని అన్నారు. ప్రభుత్వాలు స్పందించి తమ కులస్థుల కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో కోశాధికారి పాటిల్ సంతోష్, సంయుక్త కార్యదర్శి పాటిల్ లింబాద్రి, భగత్ విలాస్, భగత్ సోను, తదితరులు పాల్గొన్నారు.

వరుస చోరీలతో జనం బెంబేలు

● బంగారం ఆభరణాలు, నగదును ఎత్తుకెళుతున్న దొంగలు ● పోలీసులకు సవాల్‌గా మారిన దొంగతనం కేసులు



బీరువా తలుపులు పగులగొట్టి దొంగతనానికి పాల్పడిన దొంగలు



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): దొంగల భయంతో శుభకార్యాలకు, ఇతర కార్యాక్రమాలకు ఇల్లు వదిలి వెళ్లాలంటేనే జనాలు భయాందోళకు గురవుతున్నారు. వరుస దొంగతనాలు జరగడం అంతటా చర్చనీయాంశంగా మారింది. మండల కేంద్రంలోని భీంనగర్ కాలనీలో జరుగుతున్న వరుస దొంగతనాలు స్థానికులకు కంటిమీద కనుకు లేకుండా చేస్తున్నాయి. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలోనే దొంగలు రెచ్చిపోయి మరీ దొంగతనాలకు పాల్పడుతుండటం విశేషం. కొద్ది రోజులుగా మండల కేంద్రంలోని భీంనగర్ కాలనీలో తరచూ చిన్నచిన్న చోరీలు పెరిగిపోయాయి. ఇంటికి తాళం వేస్తే చాలు దొంగలు తమ పని కానిస్తున్నారు. వరుస చోరీలు ప్రజలకు భయాందోళనకు గురి చేస్తుండగా.. ఆ కేసులు పోలీసులకు సవాల్‌గా మారాయి. గతనెల ఫిబ్రవరి 5న భీంనగర్ కాలనీకి చెందిన సూర వెంకటి ఇంటిలో రూ.7 లక్షల చోరీ జరిగింది. ఈ సంఘటన మరువక ముందే మరో సంఘటన అదే కాలనీలో నివాసం ఉంటున్న తోడసం గీత ఇంటికి తాళం వేసి శుక్రవారం తమ సొంత గ్రామం జెండాగూడకు వెళ్లింది. శనివారం ఇంటికి తిరిగి రాగ.. తలుపులకు వేసిన తాళం తీసి ఉంది. అనుమానంతో లోపలికి వెళ్లి పరిశీలించిగా బీరువా తలుపులు తీసి ఉన్నాయి. అందులోని రూ.73 వేల నగదు కనిపించలేదు. దొంగతనం జరిగిందని గమనించిన ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటి మొత్తాన్ని పరిశీలించారు. ఎంత సొమ్ము చోరీకి గురైందనే వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం దొంగల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో వచ్చి తనిఖీలు నిర్వహించారు. దర్యాప్తులో భాగంగా ఇంటి పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. దీంతో సీసీ కెమెరాలు ఉన్నా ఆశించిన ప్రయోజనం దక్కట్లేదు. దీనికి తోడు పోలీసులు అప్రమత్తంగా లేకపోవటంతో పోలీస్‌స్టేషన్‌కు కూతవేటులోనే దొంగతనాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు.

బోథ్‌లో యువతి మిస్సింగ్

● రెండో రోజు బోథ్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చిన అధికారులు ● యువతిని తమకు అప్పగించాలని కుటుంబసభ్యుల డిమాండ్

బోథ్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రానికి చెందిన ఓ యువతి(18) ఓ వర్గానికి చెందిన యువకుడితో వెళ్లిపోయి పెళ్లి చేసుకోవడంతో మండలకేంద్రంలో శనివారం ఉద్రిక్త వాతావరణానికి దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రానికి ఓ వ్యక్తి తన కూతురు తప్పిపోయిందని గత నెల 26న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు తప్పిపోయిన సదరు యువతి కోసం వెతికారు. అయితే 28న సదరు యువతి ఓ వర్గానికి చెందిన యువకుడితో పెళ్లి చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. కాగా, ఆదిలాబాద్ పోలీస్ స్టేషన్‌లో తప్పిపోయిన యువతితో పాటు ఓ యువకుడు శుక్రవారం చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు యువతిని బోథ్ పోలీస్ స్టేషన్‌కు అదేరోజు తీసుకు వచ్చారు. దీంతో విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు తమ కూతురును అప్పగించాలంటూ డిమాండ్ చేశారు. వారికి మద్దతుగా బోథ్‌కు చెందిన దాదాపు 300 మంది యువకులు స్టేషన్‌కు తరలివచ్చారు. అంతేకాకుండా వారికి మద్దతుగా రాత్రి బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందంతో పాటు హిందూ వాహిని రాష్ట్ర నాయకులు రాళ్ల బండి మహేందర్, దశరథ్ పటేల్‌లు స్థానిక సీఐ వెంకటేశ్వర్ రావుతో చర్చించారు. అయితే యువతిని సఖి సెంటర్‌కు పంపిస్తామని సీఐ వారికి వివరించి పంపించి వేశారు. కాగా, తిరిగి శనివారం ఉదయం బోథ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడితో పాటు విశ్వహిందూ పరిషత్ నాయకులు యువతి ఎక్కడికి వెళ్లిందని సీఐని అడిగారు. దీంతో ఆమె సఖి కేంద్రానికి వెళ్లేందుకు ఒప్పుకోలేదని, దీంతో ఆమెను పెళ్లి చేసుకున్న యువకుని వద్దకు పంపించామని వివరించారు. దీంతో నాయకులు కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తపరుస్తూ తమ కూతురిని అప్పగించకుండా ఎలా పంపించారని? నిలదీశారు. ఓ దశలో యువకులు కుటుంబీకులతో కలిసి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

దీంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో విషయం తెలుసుకున్న డీఎస్పీ ముందుగా ప్రత్యేక బలగాలను పంపించారు. ఆ తర్వాత



డీఎస్పీతో మాట్లాడుతున్న కుటుంబీకులు, బీజేపీ నాయకులు

నేరడిగొండ, బజార్హత్నూర్, ఇచ్చోడ, బోథ్ ఎస్సైల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలో అడుగడుగునా పోలీసులు బందోబస్తు చేపట్టారు. కాగా, సీఐపై చర్యలకు బీజేపీ నాయకులు పట్టుపట్టారు. చివరికి డీఎస్పీ నాగేందర్ జోక్యం చేసుకొని శాంతించేశారు.

● యువతి ఇంటికి చేరుకుంది : డీఎస్పీ

బోథ్: మండల కేంద్రానికి చెందిన యువతి మిస్సింగ్ కేసు కథ సుఖాంతం అయ్యింది. ఆదిలాబాద్ డీఎస్పీ నాగేందర్ వివరాల ప్రకారం.. బోథ్ పోలీస్ స్టేషన్ నుంచి శుక్రవారం రాత్రి తీసుకువెళ్లి ఓ యువకుడికి అప్పగించారని చేపట్టిన ఆందోళన వల్ల సదరు యువతిని శనివారం సాయంత్రం వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని పేర్కొన్నారు. అయితే ఈ కేసులో యువకుడు ఆధార్ కార్డు తప్పుగా ఉందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. వాస్తవానికి యువకునికి 19 సంవత్సరాలు ఉండగా ఆధార్ కార్డును మార్పిడి చేసి 21 సంవత్సరాలుగా చూపించడం జరిగిందని తమ దృష్టికి తీసుకురావడం జరిగింది అన్నారు. దీంతో విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



గతంలో ఎయిర్‌పోర్టు విషయమై సర్వే చేసేందుకు జిల్లాకు వచ్చిన రక్షణ శాఖ హెలీక్యాప్టర్ (ఫైల్)

గాలిమోటారు ఆశలు ..గల్లంతేనా?!

(5వ పేజీ తరువాయి...)

ఈ విషయాన్ని జిల్లా అధికారులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. అయిన ఆశించిన ప్రయోజనం కనిపించడం లేదు.

అండగా నిలిచినా.. భరోసా ఏదీ !?

గడిచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లావాసులు బీజేపీకి అండగా నిలిచి ఆ పార్టీ అభ్యర్థులనే గెలిపించారు. అయినా జిల్లాకు కేంద్ర ప్రభుత్వం భరోసాను ఇవ్వడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఆదిలాబాద్ అసెంబ్లీ స్థానంతో పాటు ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ దక్కించుకుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం జిల్లాకు అనుకూలమైన నిర్ణయాలు తీసుకుంటుందని అందరూ భావించారు. ఏడాది గడిచిపోతున్నా.. ఎలాంటి భరోసా లేకపోవడంతో భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో ఎంపీ, ఎమ్మెల్యేలు విఫలమయ్యారంటూ ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నాయి. ఇప్పటికే పలుమార్లు బహిరంగ విమర్శలు చేసినా.. పట్టింపు లేకుండా పోయిందంటున్నారు. ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడమే తప్ప నేతలంతా కలిసి ఎయిర్‌పోర్టు కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసే ప్రయత్నం చేయడం లేదంటున్నారు. ఎవరికి వారే పార్టీలకు అనుకూలంగా ప్రకటనలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప. ప్రజల డిమాండ్లను పట్టించుకున్న వారే కరువయ్యారన్న విమర్శలు వస్తున్నాయి.

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిని కలిసిన ఆత్రం సుగుణ

ఉట్నూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గాంధీ భవన్ వేదికగా తెలంగాణ కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన టీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్‌ను కలుసుకోవడం జరిగిందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణ తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో రాజకీయ పరిస్థితులు, అభివృద్ధి సంక్షేమ పథకాల పై చర్చించామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లి ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులు ఉన్నారన్నారు.

ఎంఐఎం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎంఐఎం 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ శ్రేణులు శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నాయకులతో కలిసి పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేశారు. ఎంఐఎం అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేస్తోందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి నాయకులు మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఉట్నూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని గంగన్నపేటలో తాళం వేసి ఉన్న ఆత్రం వినాయకరావు ఇంట్లో శనివారం దొంగతనం జరిగిందని ఎస్సై మనోహర్ తెలిపారు. తాళం వేసి ఉన్న ఇంటిని చూసి వినాయకరావు ఇంట్లోకి చొరబడి రూ.34వేల నగదు, తులంన్నర బంగారం, వెండి ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినారని బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ఆలయం వద్ద భక్తుల సందడి

ఘనంగా అంబల్ల పండుగ

కుబీర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్డి(బీ) గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయ జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం అంబళ్ల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, భక్తులు అంబళ్ల కుండలను ఎత్తుకొని గ్రామంలోని ప్రధానవీధుల గుండా భక్తి గేయాలు భజనలు చేస్తూ శోభయాత్ర నిర్వహిస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కుంటలోని అంబలి గుడాలను దేవతామూర్తులకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

● నిర్మల్ జిల్లా విద్యాధికారి రామారావు



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి

నిర్మల్‌రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని జిల్లా విద్యాధికారి అన్నారు. మండలంలోని కొండాపూర్‌లో గల చంద్రశేఖర్ కన్వెన్షన్‌హాల్‌లో చాణిక్య హైస్కూల్ తరంగ్ 2025, వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ... సరస్వతీ తల్లి కొలువుదీరిన జిల్లా విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. ప్రతివిద్యార్థి చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో శ్రమిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి టి.రామారావు, మండల విద్యాధికారి జి. నాగేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి వి.వినోద్‌కుమార్, జిల్లా పరీక్షల విభాగం ఇన్‌చార్జి వి.భానుమూర్తి, పాఠశాల డైరెక్టర్లు సిహెచ్. వెంకట్ రెడ్డి, టి.ప్రమోద్‌రావు, ఏ.ప్రభాకర్, కే.శంకర్, పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.హరీష్‌కు మార్, జిల్లా ట్రస్మా అధ్యక్షుడు పి.చంద్రగౌడ్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యవసాయంపై విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



వివిధ అంశాలపై వివరిస్తున్న విద్యార్థులు

ముథోల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో శనివారం జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యా లయం విద్యార్థులు వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గల సహజవనరులు, వాటి వినియోగం, మౌలిక సదుపాయాలు, పంటలు వాటి పరిస్థితులు, తదితర అంశాలపై వివరిస్తూ వాటికి సంబంధించిన పటం చెట్టును సమస్యల పరిష్కారం చెట్టు పటాల ద్వారా వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రత్యూషరెడ్డి, స్వార్థిక, రుచిత, దివ్య, హిమబిందు తదితరులు వివరించారు. ఇప్పటివరకు జరిగే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ముథోల్ వ్యవసాయ పరిశోధన స్థానం ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ విజయకుమార్, డాక్టర్ కార్తీక్, గ్రామ అభ్యుదయ రైతులు నర్సారెడ్డి, రామ్‌రెడ్డి, హనుమంత్ రెడ్డి, సాయి రెడ్డి, జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ

లోకేశ్వరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. మా అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో లోకేశ్వరం మండలంలోని మోహలా గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి లోకేశ్వరం తహసీల్దార్ మోతిరాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహారాష్ట్ర వలస కూలీలకు దాదాపు 50 మందికి నూతన దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మా అమ్మానాన్న ఫౌండేషన్ చైర్మన్ ఎం.అంజనేయులు, లోకేశ్వరం సర్వేయర్ సునీత్, రమేష్, సుధాకర్, భోజన్న పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

కుంటాల, మార్చి 1 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండల పోలీస్ స్టేషన్ పరిధిలో విధులకు ఆటంకం కలిగించినందుకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భాస్కరాచారి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం శనివారం ఉదయం కల్లూర్‌లో జాతీయ రహదారి పక్కన మేకల సంత జరుగుతుండగా రోడ్డుపైన మేకలు, గొర్లు పెట్టి వాహనదారులు వెళ్లకుండా ఇబ్బందులు కలిగే విధంగా ఉన్నాయన్న ఫిర్యాదు మేరకు ఇక్కడ మేకల సంతలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నిబంధనల మేరకు రోడ్డుపై నిలిచి ఉన్న వాహనాలను పక్కకు తప్పించే క్రమంలో నర్సాపూర్ (జీ) మండలం చాక్‌పెల్లి గ్రామానికి చెందిన గోరెమియా, పిర్దోస్ గోరెమియా తండ్రి కొడుకులు ఇద్దరు పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు వారిపై కేసు నమోదు చేసినట్లు, చట్టరీత్యా చర్యలకు ఆదేశించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కుంటాల, మార్చి, 1 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలతో పాటు లింబా (బీ) తదితర గ్రామాలలో ఇటీవల పలు అకాల కారణాలతో మృతిచెందిన బాధిత కుటుంబసభ్యులను శనివారం ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరామర్శించారు. ఈ సందర్భంగా ధైర్యంగా ఉండాలని అధైర్యపడవద్దని సూచించారు. వారి మృతికి గల కారణాలను కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వెంగల్‌రావు, రమణరావు, ప్యాదరి భూమన్నతో పాటు పలువురున్నారు.

జాతీయ స్థాయి అబాకస్ పోటీలకు పెంబి విద్యార్థి ఎంపిక

పెంబి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి అబాకస్ విజువలైజేషన్‌కు పెంబి మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలకు చెందిన విద్యార్థి దేశవేణి మనోజ్ఞ ఎంపిక కావడంతో శనివారం పాఠశాల ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. విశ్వం ఎడ్యుటెక్ హైదరా బాద్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుప్పాల మల్లేష్, ఉపాధ్యా యులు పుప్పాల సుజాత, కైలాష్, వినోద్, సౌజన్య, శ్రీలత, రాజమణి, అక్షయ, సుప్రియ, కావ్య, తదిత రులు ఉన్నారు.

ప్రణాళికతో చదివితే ఫలితాలు

● భైంసా అగ్నిమాపక శాఖ ఎస్సై మదిపెల్లి రవి



మాట్లాడుతున్న అగ్నిమాపక శాఖ ఎస్సై

ముథోల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి విద్యార్థులు పట్టుదల, ప్రణాళికతో చదివితే ఫలితాలు సొంతం చేసుకోవచ్చని భైంసా అగ్నిమాపకశాఖ ఎస్సై మదిపెల్లి రవి అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని శిశుమందిర్ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. 10వ తరగతి విద్యార్థుల గురించి ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి పట్టుదల, క్రమశిక్షణతో ఉండి అమ్మనాన్న కన్న కలలను నిజం చేయాలన్నారు. అగ్నిమాపక శాఖ సేవలను అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం అగ్నిమాపక శాఖ ఎస్సైని సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు సారథి రాజు, అకాడమిక్ ఇన్‌చార్జి దేవేం దర్ చారి, ఆచార్యులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

శనగ పంట దగ్ధం



కాలిబూడిదైన శనగపంట

తానూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోలూర్ గ్రామానికి చెందిన బాగ్డే గంగాధర్ పొలంలో శనగ పంట దగ్ధం అయినట్లు శనివారం ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. గంగాధర్ తనకున్న 10 ఎకరాల్లో ఒకటిన్నర ఎకరంలో శనగ పంట వేశారు. ఫిబ్రవరి 22వ తేదీన మిషన్ సహాయంతో శనగ పట్టించి అమ్మడానికి కుప్పలుగా వేసి సిద్ధంగా ఉంచారు. ఐదుగంటల సమయంలో లేచి చూడగా మంటల్లో కాలిపోయింది. ఈ విషయంపై గ్రామస్తులతో చర్చించడం వలన ఫిర్యాదు చేయడానికి సమయం పట్టినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'సంక్షేమ బోర్డు స్కీమ్‌లను ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వొద్దు'

ఆదిలాబాద్ రూరల్, మార్చి 01 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీమ్‌లను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వద్దని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంటక నారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల భవన, నిర్మాణ కార్మిక సంఘం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఈనెల 4న కార్మిక శాఖ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాల చేపడుతున్నామన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బొమ్మెన సురేష్

కడెం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ సంక్షేమ స్కీంలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వరాదని, ప్రభుత్వమే నేరుగా సంక్షేమ బోర్డు ద్వారా పథకాలను అమలు చేయాలని సీఐటీయూ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. భవననిర్మాణ వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మికసంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేయాలని, వలస కార్మికుల కోసం సరైన సౌకర్యాలతో నైట్‌షెల్టర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కొమురయ్య, కోటయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ యువజన విభాగం జనరల్ సెక్రెటరీగా సౌమ్య



నిర్మల్‌రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నిర్మల్ నియోజకవర్గ జనరల్ సెక్రెటరీ గా ఎంబరి సౌమ్యను కాంగ్రెస్ అధిష్ఠానం శని వారం నియమించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పార్టీ అభి వృద్ధి కోసం తనవంతుగా పనిచేస్తానని తెలిపారు. ఆమెను జనరల్ సెక్రెటరీగా నియమించడం పట్ల పలువురు స్థానిక నాయకులు ఈ సందర్భగా హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎంబరి గంగాధర్ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాతో సన్మానించారు.

తాంసిలో కుక్కల లొల్లి

తాంసి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో కుక్కల లొల్లి రోజురోజుకు పెరుగుతోంది. ఎప్పుడు ఎవరిని కరుస్తాయో, ఏ జంతువును చంపు తున్నాయో తెలియడం లేదు. చిన్నపిల్లలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. మండల కేంద్రమైన తాంసిలో వారం రోజుల్లో ఐదుగురిని కరిచాయి. హస్నాపూర్, పొన్నారి, గిరి గాప్, గోట్కూరి, గ్రామాలలో పలు మేకలను, లేగ దూడలను చంపాయి. తమను కుక్కల భారీ నుంచి కాపాడాలని మండల వాసులు కోరుతున్నారు.



గుంపులుగా ఉన్న కుక్కలు

భళా.. బాల విజ్ఞాన మేళా!

● విద్యార్థులు సైన్స్‌తో నూతన ఒరవడి సృష్టించాలి ● ముథోల్ ఎస్సై సంజీవ్
● 650కు పైగా విద్యార్థుల సైన్స్ ప్రయోగాలు



ముథోల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సైన్స్‌ను ఉపయోగించి భవిష్యత్తులో నూతన ఒరవడిని సృష్టించాలని ముథోల్ ఎస్సై సంజీవ్ అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో శనివారం విజ్ఞాన మేళాను ఘనంగా నిర్వహించారు. సైన్స్ ప్రాధాన్యాన్ని ప్రతీ ఒక్కరికి తెలియజేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు సుమారు 650కు పైగా సైన్స్ ప్రదర్శనలు రూపొందించారు. పాఠశాలలో విద్యార్థులు సామాన్య, జీవ, గణిత, సాంఘిక శాస్త్రాలతో పాటు శాస్త్ర సాంకేతిక పర్యావరణం, సాంస్కృతి, సాంప్రదాయాలు, సామాజిక అంశాలపై కృత్యాలు ప్రదర్శించారు. డీఎన్‌ఏ వర్కింగ్ మోడల్, సేంద్రియ నిర్మా ణం, రక్త ప్రస రణ వ్యవస్థ, గ్లోబల్ వార్మింగ్, అస్థిపంజర వ్యవస్థ, గ్రహం, పాలిథిన్‌ను రీసైక్లింగ్ చేయడం, చంద్రయాన్ మోడల్, ఆటోమేటిక్ ఫైర్ అలారం, స్మార్ట్ డస్ట్ బిన్, పిన్‌హోల్ కెమెరా, ఓబ్స్టాకిల్ డాటెక్టర్, సేంద్రియ వ్యవసాయం, సౌర శక్తి ప్రయోజనాలు, 3డీ షో, హర్రర్ రూమ్, రోబోటిక్, మానవుని జీర్ణ వ్యవస్థ, తదితరవి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసంవార్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్న యాదవ్, భీమ్‌రావు దేశ్‌ముఖ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రదర్శనలను పరిశీలిస్తున్న ముథోల్ ఎస్సై





విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రదర్శనలు



నేటి నుంచి బరంపూర్‌లో

బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవాలు

● నేడు స్వామి వారి కల్యాణం ● 4న రథోత్సవం ● తెలంగాణ తిరుపతి ఆలయంగా అభివృద్ధి

భక్తి



బరంపూర్ కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయం



ఆలయంలో స్వామి వారి మూల విరాట్



బరంపూర్ కొండపై వేంకటేశ్వర స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

తలమడుగు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం బరంపూర్ కొండపై స్వయంభుగా వెలిసిన శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు నేటి నుంచి నిర్వహించనున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బరంపురం కొండపై స్వయంభుగా వెలిసిన వెంకటేశ్వర స్వామికి దశాబ్దాల చరిత్ర ఉందన్నారు. దాదాపు 150 సంవత్సరాల నుంచి ప్రతీ సంవత్సరం స్వామివారి బ్రహ్మోత్సవాలు వేంకటేశ్వర స్వామి కల్యాణం, రథోత్సవం, సుదర్శన మహాయజ్ఞం ఇతర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 2న స్వామివారి కల్యాణోత్సవం, 3న సుదర్శన యజ్ఞం 4న రథోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఆలయాన్ని రెండేళ్ల క్రితం గ్రామస్థుల, భక్తుల సహకారంతో దాదాపు ఆరు కోట్ల వ్యయంతో ఆలయాన్ని పునర్నిర్మించి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రతీ శనివారం ఆలయంలో దాదాపు రెండు వేల మందికి మహా అన్నదానం నిర్వహించనున్నామన్నారు. అంతేకాకుండా భక్తుల సహకారం, గ్రామస్థుల ప్రోత్సాహంతో బరంపూర్ కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామిని. తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు అదిలాబాద్ జిల్లాతో పాటు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, నిజామాబాదు, మహారాష్ట్ర. నుంచి వేలాది మంది భక్తులు తరలివస్తున్నారన్నారు. అదేవిధంగా 4న నిర్వహించే రథోత్సవం తర్వాత తిరుమల లడ్డును వేలంపాట వేయడం జరుగుతుందన్నారు. ఈ లడ్డుకు దాదాపు లక్ష నుంచి రెండు లక్షల వరకు వేలంపాట సాగుతుం దన్నారు. అదేవిధంగా ఈ బ్రహ్మోత్సవాలకు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరుకానున్నారని తెలిపారు. అంతేకాకుండా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి బ్రహ్మోత్సవాలను కన్నుల పండువగా దర్శించుకొని వేంకటేశ్వర స్వామి దీవెనలు పొందాలని కోరారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

● ఐటీడీఏ ఏటీడబ్ల్యు అనిల్‌కుమార్



ఉమ్రి ఆశ్రమ పాఠశాలలో మాట్లాడుతున్న అధికారులు



నృత్యం చేస్తున్న విద్యార్థిని

తలమడుగు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉమ్మరి గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం రాత్రి పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీడీఏ ఏటీ డబ్బులు అనిల్ కుమార్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు ముఖ్యంగా ఆదివాసి గిరిజన విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు చేసిన సంస్కృతి సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ, వార్డెన్ హిరమన్ సీఆర్టీలో సంతోష్, దిగంబర్ మాజీ సర్పంచ్ గోపాల్ గ్రామ పెద్ద మాధవరావు పాల్గొన్నారు.



శనగ పంట పొలం

తగ్గిన శనగ దిగుబడి

తాంసి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రబీలో వేసిన శనగ పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందని రైతులు అంటున్నారు. ఎన్నో ఆశలు పెట్టుకొని పంటను సాగు చేస్తే ఎకరానికి కనీసం నాలుగు నుంచి ఐదు క్వింటాలు కూడా రాలేదని అంటున్నారు. మార్కెట్లో గిట్టుబాటు ధర సైతం కనిపించడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటుకు అమ్ము కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ వ్యాపారులకు వారు అనుకున్న ధరకే అమ్మాల్సి వస్తుందని శనగ రైతులు అంటున్నారు. ఎకరానికి సుమారు 30 వేల వరకు ఖర్చు చేస్తే కేవలం 25 వేలు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ లెక్కన తమ పెట్టుబడి సైతం చేతికి రావడం లేదని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు చేయాలని శనగ రైతులు కోరుతున్నారు.



కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ఆత్మరక్షణకు

కరాటే అవసరం

బోథ్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతగానో ఉపకరిస్తుందని, అందుకు విద్యార్థులు కరాటే శిక్షణ అవసరమని భావించిన ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కరాటేలు శిక్షణ ఇప్పిస్తున్నారు. మండలంలోని కేజీబీవీ మోడల్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇప్పిస్తున్నారు. అంతేగాక మండలంలోని కనుగుట్ట, పొచ్చెరా, కౌట(బి) గ్రామాల్లో పాఠశాల విద్యార్థులు కరాటే శిక్షణ పొందుతున్నారు.

● మూడు నెలల శిక్షణ

ప్రభుత్వం వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షకుల ద్వారా మూడు నెలల పాటు కరాటే నేర్పుతున్నారు. 36 క్లాసులను నిర్వహించి విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. అయితే కరాటే నేర్చుకున్న విద్యార్థులు మరింత ఆసక్తి చూపి వివిధ రకాల శిక్షణను పొందడం జరుగుతుంది.

● ఆత్మ రక్షణకు శిక్షణ అవసరం

విద్యార్థులకు తమ ఆత్మ రక్షణ కోసం అత్యవసర సమయంలో కరాటే ఎంతగానో ఇస్తుందని శిక్షకుడు రాజు పేర్కొన్నారు. కరాటేతో పాటు వారిలో ధైర్యాన్ని నింపేందుకు గాను పలు రకాల శిక్షణ ఇస్తున్నామన్నారు. తనతో పాటు మరో ఇద్దరు శిక్షకులు విద్యార్థులకు కరాటే నేర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులతో బోథ్, సోనాల పాఠశాలలు శిక్షణ తరగతులను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

● ఆసక్తి చూపుతున్న బాలికలు

కరాటే నేర్చుకునేందుకు బాలికలు ఆసక్తి చూపుతున్నారని శిక్షకులు అంటున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బాలికలు ఆత్మరక్షణ కోసం శిక్షణ తీసుకుంటున్నారని భవిష్యత్తులో వీరికి ఎంతగానో ఉపయోగపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంటున్నారు. ఏది ఏమైనా కరాటే నేర్చుకునేందుకు పలు పాఠశాలల విద్యార్థులు ముందుకు వస్తున్నారని వారు పేర్కొన్నారు.

అలరించిన కేజీబీవీ విద్యార్థుల నృత్యాలు





దిలావర్‌పూర్ కేజీబీవీ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

దిలావర్‌పూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పదో తరగతి, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. సాంప్రదాయ నృత్యాలైన భరత నాట్యం, కూచిపూడి తదితర ప్రదర్శనలతో అలరించారు. జానపద నృత్యాలతో పాటు సందేశాత్మక నాటికలను ప్రదర్శించారు. విద్యార్థుల స్కిట్లు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ లక్ష్యాన్ని సాధించడానికి కష్టాన్ని ఇష్టంగా చేసుకుని ముందుకెళ్లాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ అపర్ణ అన్నారు. విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తును బంగారు మయం చేసుకునే బాధ్యత మీదేనన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నాసిరకం పనులతో తప్పని ఇక్కట్లు



ఆదిలాబాద్ పట్టణంలోని 20వ వార్డు పరిధిలో ఏడాది కిందట వేసిన రోడ్డు పగుళ్లు తేలింది. గుత్తేదారు, అధికారుల నిర్లక్ష్యానికి స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు వేసిన సంవత్సరం లోపే పగుళ్లు తేలి వాహనాల రాకపోకలకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. కొత్తగా రోడ్డు వేస్తే సంతోషించిన జనాలకు ఏడాది కూడా ఆ ఆనందం మిగల్లేదు. నాసిరకం నిర్మాణ పనులు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, తిరిగికాలనీలో కొత్తగా రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)

ఫొటో న్యూస్



నాసిరకం పనులతో పగుళ్లు తేలి కనిపిస్తున్న రోడ్లు

ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.8 కనిష్ఠం 16.8
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
ఆదివారం 2 మార్చి 2025



ఎయిర్‌పోర్టు ఆశలు.. గల్లంతేనా!?



జిల్లాకేంద్రంలో ఎయిర్‌పోర్టును నిర్మించేందుకు గుర్తించిన స్థలం


- జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై మళ్లీ ఊసెత్తని కేంద్రం ప్రభుత్వం
- వరంగల్‌లో మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్
- జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు విఫలమయ్యారంటూ ప్రతిపక్షాల విమర్శలు
- దశాబ్దాలుగా జిల్లావాసులకు తప్పని ఎదురుచూపులు
- విమానాశ్రయం ఏర్పాటుతో వ్యాపార, రవాణా సౌకర్యాలు మెరుగుపడే అవకాశం

ఆదిలాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న జిల్లావాసుల గాలిమోటారు ఆశలు గల్లంతవుతున్నాయి. ఇదిగో అదిగో అంటూ ఆశచూపుతున్న కేంద్ర ప్రభుత్వానికి జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్న విమర్శలు వస్తున్నాయి. తాజాగా రాష్ట్రంలో వరంగల్ జిల్లా మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో జిల్లావాసుల్లో స్థానికంగా కూడా ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలన్న విషయమై చర్చనీయాంశంగా మారింది. దశాబ్దాలుగా ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని చేపట్టాలన్న డిమాండ్లు వస్తున్నాయి. అయితే ఇన్నాళ్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సఖ్యత లేదన్న కారణంగా తీవ్ర జాప్యం జరుగుతూ వచ్చింది. ప్రతిసారి ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు విమానాశ్రయ నిర్మాణ విషయాన్ని ప్రధాన ఎజెండాగా చేసుకుని ఎన్నికల్లో గట్టెక్కడం పరిపాటిగా మారింది. ఎన్నికల తర్వాత ఆ విషయాన్నే పూర్తిగా మరిచిపోవడంతో విమానాశ్రయ నిర్మాణం కలగానే మిగిలి పోయింది. ఉత్తర, దక్షిణ రాష్ట్రాలను కలుపుతూ 44వ జాతీయ రహదారిపై కేంద్ర బిందువుగా ఉన్న జిల్లాలో ఎయిర్‌పోర్టును నిర్మిస్తే వ్యాపార, రవాణా సౌకర్యాలు మరింతగా మెరుగుపడే అవకాశం ఉంటుంది. హైదరాబాద్, నాగపూర్ ఎయిర్‌పోర్టులకు సుమారుగా 200 కి.మీ.ల దూరంలో ఉన్న జిల్లాకేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణాని కి అన్నిరకాల పరిస్థితులు అనుకూలంగానే ఉన్నట్లు తెలుస్తుంది. గత నాలుగు మాసాల క్రితమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి కె.రాంమోహన్‌నాయుడిని కలిసి జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణ విషయమై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆశలు చిగురించినా.. కేంద్ర ప్రభుత్వం మాత్రం జిల్లాకు మళ్లీ మొండి చేయి చూపడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రధాని పర్యటనలో దక్కని హామీ

2024 పార్లమెంట్ ఎన్నికల సమయంలో జిల్లా నుంచే ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. సుమారుగా 40ఏళ్ల తర్వాత దేశ ప్రధాని జిల్లాకు రావడంతో జిల్లావాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక సమస్యలైనా సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, ఎయిర్‌పోర్టు నిర్మాణం, కేంద్రీయ విశ్వ విద్యాలయం, పత్తి ఆధారిత పరిశ్రమలు, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్ నిర్మాణంపై ఏదో ఒక హామీ ఉంటుందని ఆశపడ్డారు. కానీ ప్రధాని నరేంద్రమోదీ జిల్లా సమస్యల జోలికి వెళ్లకుండానే తన పర్యటను ముగించారు. దీంతో జిల్లావాసులకు తీవ్ర నిరాశే మిగిలింది. గతంలో వైమానిక శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేం దుకు కేంద్ర రక్షణశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా అధికారులు 369.50 ఎకరాల స్థలాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపించారు. దీనికి అదనంగా మరో 2వేల ఎకరాల స్థలం అవసరమని కేంద్ర ప్రభుత్వం సూచించడంతో 1590.05 ఎకరాల స్థలాన్ని పట్టణ శివారు ప్రాంతంలోని అనుకుంట, ఖానాపూర్, కచికంటి, తంతోలి గ్రామాల పరిధిలో గుర్తించారు. ఈ స్థల సేకరణకు ప్రస్తుతం సుమారుగా రూ.438.67 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే

(తరువాయి 6వ పేజీలో...)



త్వరలోనే జిల్లావాసులు శుభవార్త వింటారు

: పాయల శంకర్, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

జిల్లా ఎయిర్‌పోర్టుపై త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి శుభ వార్త అందుతుంది. ఇప్పటికే ఎయిర్‌పోర్టు నిర్మాణం విషయం ఫైనల్ స్టేజీలో ఉంది. కేంద్ర పౌర విమానాయన మంత్రి రాంమోహన్ నాయుడితో మాట్లాడడం జరిగింది. త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అన్ని రకాల ప్రయత్నాలు జరుగుతున్నా యి. తరచూ కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలుస్తూ విమానాశ్రయం గురించి మాట్లాడడం జరుగుతుంది.



బీజేపీ నేతలు మాటలతోనే సరిపెడుతున్నారు..

: జోగు రామన్న, మాజీ మంత్రి, ఆదిలాబాద్

బీజేపీ నేతలు మాటలతోనే సరిపెడుతున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ గెలిచిన కేంద్రం నుంచి రావాల్సిన పథకాలను సాధించ లేకపోతున్నారు. చిత్తశుద్ధి ఉంటే జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలి. గతంలో మా ప్రభుత్వంపై ఎన్నో ఆరోపణలు చేశారు. ఇప్పుడు ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఏమీ అడ్డంకులు ఉన్నాయో? చెప్పాలి. గతంలో తీవ్ర ప్రయత్నాలు చేసినా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎంపీ, ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకొస్తేనే కేంద్ర ప్రభుత్వం దిగివస్తుంది. ఎంపీ, ఎమ్మెల్యేల వెంట ఢిల్లీకి వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నాం.



ఎంపీ, ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారు

: కంది శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఆదిలాబాద్

జిల్లాకేంద్రంలో ఎయిర్‌పోర్టు మంజూరు విషయంలో ఎంపీ, ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారు. గల్లీలో ఫోజులు కొడుతున్నా.. ఢిల్లీలో మాత్రం పిల్లులుగా మారి పోతున్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో సత్సంబంధాలు లేకపోవడంతోనే జిల్లాకు ఎలాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలు మంజూరుకావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే జిల్లా సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుంది. వరంగల్‌కు మంజూరైన ఎయిర్‌పోర్టు జిల్లాకు ఎందుకు మంజూరు కాలేదో? ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలకు సమాధానం చెప్పాలి.



ఫటా..ఫట్...

వేసవిలో 25 ఎంఎల్‌డీ నీటి సరఫరాకు ఏర్పాట్లు

● సీవీఎన్ రాజు, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్



ఆంధ్రజ్యోతి: వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు...?

కమిషనర్: వేసవిని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. మిషన్ భగీరథ నుంచి 30 ఎంఎల్‌డీ నీటి సరఫరాకు గాను 18 ఎంఎల్‌డీ, లాండసాంగి నుంచి 6 ఎంఎల్‌డీ నీళ్లు వస్తున్నాయి. వేసవిలో 25 ఎంఎల్‌డీ అందుబాటులో ఉంటే సరిపోతుంది. దీనిక తోడు 9 ట్యాంకర్లు ఉన్నాయి. 7, 8 కాలనీల్లో మాత్రమే నీటి ఎద్దడి తలెత్తే అవకాశం కనిపిస్తోంది.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ స్థలాలు అక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటున్నారా?

కమిషనర్: పట్టణంలోని ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశాం. ఇందుకు గాను ప్రత్యేకంగా 9492164153 టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేశాం. ఈ నెంబర్‌కు ఫిర్యాదు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం ఎలా చూపుతారు?

కమిషనర్: పట్టణంలో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికే వ్యాపారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాం. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో దేవిచంద్‌చౌక్, అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, శివాజిచౌక్‌లో 186మంది వీధి వ్యాపారులను గుర్తించాం. త్వరలోనే గణేష్ థియేటర్ స్థలంలో 6/8 సైజులో దుకాణాలను కేటాయిస్తాం. లాటరీ పద్ధతినా వ్యాపారులను ఎంపిక చేస్తాం.

ఆంధ్రజ్యోతి: పార్కుల పరిస్థితి అధ్వానంగా మారింది కదా?

కమిషనర్: పట్టణంలో ఏర్పాటు చేసిన పార్కుల పరిస్థితి కొంత అధ్వానంగా ఉన్న మాట వాస్తవమే. ఇటీవలే పలుకాలనీల్లో ఉన్న పార్కులను పరిశీలించడం జరిగింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పిచ్చిమొక్కలను తొలగిస్తున్నాం. వెంటనే మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకొస్తాం. అలాగే ఓపెన్ జిమ్‌లకు కూడా మరమ్మతులు చేపడుతాం.. మరింత అందుబాటులోకి తీసుకువస్తాం.

ఆంధ్రజ్యోతి: చెత్త సేకరణను సక్రమంగా చేపడుతున్నారా?

కమిషనర్: చెత్త సేకరణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవు. సరిపడా కార్మికులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. నిధులకు కూడా కొరత లేదు. ఫిర్యాదు వచ్చిన వెంటనే చర్యలు చేపడుతున్నాం. బయోమైనింగ్ పనులు ఇంకా పూర్తికావాల్సి ఉంది. చెత్త సేకరణ పై ప్రజల్లో మరింత అవగాహన కల్పిస్తున్నాం.

- ఆదిలాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి)



కరపత్రాలను విడుదల చేస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా

జాతీయ కార్యక్రమాల పోస్టర్ విడుదల

ఉట్నూర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల (బాలికలు) ఇంగ్లీష్ విభాగం, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏ సంయుక్తంగా, ఎన్ఐటీ వరంగల్, జిల్లా ఫౌండేషన్, యూఎస్ఏఐడీ సంఘీభావంతో ఎంపవరంగ్ ఈఎల్‌టీ చేంజ్ మేకర్స్ విత్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ నిర్వహిస్తున్నారని ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఇట్లు గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ప్రాజెక్టు అధికారి చాంబర్‌లో జాతీయ కార్యక్రమాల పోస్టర్‌ను విడుదల చేశారు. అంతేకాకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పోస్టర్‌ను ఈ సందర్భంగా విడుదల చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో ఆంగ్ల భాషా బోధనలో మార్పులకు దారి చూపే మార్గదర్శకులను ప్రేరేపించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమం మార్చి 13న ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగనున్నదని, ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొనవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాల (బాలికలు) ప్రిన్సిపాల్ హరిత, వైస్ ప్రిన్సిపాల్ ప్రత్యూష, అధ్యాపకులు బుర్రమానస, పల్ల హరిక, తదితరులు పాల్గొన్నారు.

చెట్లను నరికితే కఠిన చర్యలు

● జిల్లా అటవీ శాఖ అధికారి అహ్మద్ ఖాన్

తాంసి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అడవుల రక్షణ అందరి బాధ్యతగా తీసుకున్నప్పుడే వాతావరణంలోని కాలుష్యాన్ని అరికట్టవచ్చని అటవీ శాఖ అధికారి అహ్మద్ ఖాన్ అన్నారు. శనివారం మండలంలోని అట్నం గూడా, లింబుగూడ, గిరిగావ్ అటవీ ప్రాంతాల్లో నివాసముండే గిరిజనులకు చెట్ల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెట్లను నరికితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెట్లు ఉన్నప్పుడే వాతావరణంలోని కాలుష్యాన్ని కాపాడవచ్చన్నారు. అడవులు ఉంటేనే సమృద్ధిగా వర్షాలు కురుస్తాయి అన్న విషయాన్ని గ్రహించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికితే కఠిన చర్యలు తప్పవని సూచించారు. వన్య ప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత కూడా అందరిపై ఉందన్నారు. మండలంలోని ఏ ప్రాంతంలో కూడా చిరుత గాని, పెద్దపులి గాని సంచరించడం లేదని, ఇప్పటి వరకు ఎలాంటి నష్టం కూడా కలగలేదని అన్నారు. ఎవరైనా చెట్లు నరికినా.. వన్యప్రాణులను వేటాడినా.. తమకు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా గిరిజన యువకులు చైతన్యవంతులై చెట్లను నరికితే రానున్న రోజుల్లో జరిగే నష్టాలను వారి వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆయన కోరారు. కొత్త వ్యక్తులు కనుక అటవీ ప్రాంతాల్లో సంచరించినట్లయితే తమకు తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా అడవుల విషయాలపై అవగాహన కల్పించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి : కలెక్టర్

ఆదిలాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉపాధ్యాయులు భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. జైనథ్ ఆదర్శ పాఠశాల అధ్యాపకులు గొన్కుల సత్యనారాయణ రచించిన 'భారతీయ, పాశ్చాత్య శాస్త్రవేత్తలు' అనే పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ జ్ఞానాన్ని, వృత్తి పరమైన అనుభవాలను గ్రంథస్థం చేసి ముందు తరాలకు అందించాలని సూచించారు. మన దేశానికి సంబంధించిన శాస్త్రవేత్తల గురించి ప్రస్తావించడం మంచి ప్రయత్నం అని అభినందించారు. ఇందులో ఆరోగ్య పాఠశాల సమన్వయకర్త దీకొండవార్ అజయ్, ప్రిన్సిపాల్ రాము, బయోసైన్స్ జిల్లా ఫోరం అధ్యక్షుడు రఘువేందర్, తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ శాఖకు నూతన జాగిలం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): 9 నెలల పాటు హైదరాబాద్ మెయినాబాద్‌లో కఠోర శిక్షణ పొంది శనివారం జిల్లాకు వచ్చిన నూతన జాగిలం టాంగోను జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ గౌస్ ఆలంకు సిబ్బంది పరిచయం చేశారు. జిల్లా అంతర్గత భద్రతలలో కీలక పాత్ర పోషించనున్న జాగిలాల బృందానికి అదనపు బలంగా టాంగో రావడం సంతోషకరమని ఎస్పీ అన్నారు. ఆయన వెంట రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ వెంకటి, డాగ్ స్క్వాడ్ బృందం ఉన్నారు.

న్యాయాధికారుల పోస్టుల భర్తీకి కృషి

● హైకోర్టు న్యాయమూర్తి జడ్జి రేణుకా యార

ఆదిలాబాద్ రూరల్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో న్యాయాధికారుల పోస్టుల ఖాళీల కారణంగా ఇబ్బందులు వస్తున్నాయని న్యాయవాదులు తమ దృష్టికి తీసుకొచ్చారని, వారి భర్తీకి తన వంతుగా కృషి చేస్తానని హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రేణుకా యార అన్నారు. శనివారం జిల్లాకు వచ్చిన ఆమెను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయమూర్తితో పాటు జిల్లా న్యాయాధికారులను సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా.. వాటి పరిష్కారం కోసం సహకారం అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి రేణుకా యార మాట్లాడుతూ జిల్లాలోని కోర్టుల్లో న్యాయాధికారుల ఖాళీలు ఇబ్బంది పెడుతున్నాయని, కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయని న్యాయవాదులు చెబుతున్నారన్నారు. ఈ విషయం తన దృష్టిలో ఉందని తెలిపారు. ఇన్‌చార్జి బాధ్యతలు ఇతర న్యాయాధికారిపై అధికభారం మోపుతాయన్నారు. ఏ సమయంలో ఎక్కడ ఉండాలో తెలియక వారికి ఇబ్బందులు తెస్తాయన్నారు. అలాగే కోర్టుల్లో మౌలిక వసతులు, ఇతర కార్యక్రమాలను చేపట్టేందుకు కూడా సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి ప్రభాకర్‌రావు, న్యాయాధికారులు శివరాం ప్రసాద్, ప్రమీల జైన్, దుర్గారాణి, సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేష్, పీపీలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

● డిస్పెన్సరీని ప్రారంభించిన హైకోర్టు జడ్జి

కోర్టుకు వచ్చే నేరస్తులతో పాటు కక్షిదారులు, సిబ్బందికి ఆరోగ్య సమస్యలు తలెత్తిన సమయంలో డిస్పెన్సరీ ఉపయోగపడుతుందని హైకోర్టు జడ్జి రేణుకా యార అన్నారు. జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన డిస్పెన్సరీని ఆమె ముఖ్య అతిథిగా హాజరై వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభించారు. ముందుగా ఆమె పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. న్యాయమూర్తికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం డిస్పెన్సరీని ప్రారంభించి ఇక్కడ అందుబాటులో ఉండే వైద్యులు, అందించే సేవలు, సిబ్బంది వివరాలను కలెక్టర్ రాజర్షిషా ఆమెకు వివరించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయాధికారి, న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎస్పీ గౌస్ ఆలం, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధన, పీపీలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మొక్కకు నీళ్లు పోస్తున్న హైకోర్టు జడ్జి రేణుకా యార



డిస్పెన్సరీని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి రేణుకా యార



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయామూర్తి



పార్టీ పక్షాన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

● మాజీ మంత్రి హరీష్‌రావుకు మాల సంక్షేమ సంఘ నాయకుల వినతి

ఆదిలాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుని వారి నివాసంలో కలిసి ఎస్సీ వర్గీకరణ అంశంపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునర్ సమీక్షించాలని విన్నవించారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు జరిగిన అన్యాయాన్ని అసెంబ్లీలో పార్టీ పక్షాన ప్రభుత్వం దృష్టికి తీసుకు రావాలని కోరారు.రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014-2024 ప్రభుత్వం ద్వారా అమలు చేయబడిన పథకాలు విద్యా, ఉద్యోగం స్వయం ఉపాధి, దళితబంధు, దళిత బస్తీ, రాజకీయ అన్ని రంగాలలో మాలలకు మాల ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణను పునర్ సమీక్షించి 2024 జనాభా లెక్కల ప్రకారం మాలలకు న్యాయం జరిగే విధంగా ఎంపారికల్ డాటా సేకరించి రాజ్యాంగబద్ధంగా వర్గీకరణ చేయాలని మాల సంక్షేమ సంఘం జిల్లా శాఖ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇందులో కొప్పుల రమేష్, బేర దేవన్న, సింగరి అశోక్, రాఘవేంద్ర, మేదరి స్వామి, మలపతి సుభాష్, గులే సోమన్న, తదితరులున్నారు.



హరీష్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు